విషాదం పొంగి పొర్లింది

శ్రీ జనస్వామి కోదండరామశాస్త్రి

కొబ్బరి బొండంలాటి నున్నటితల చివర పిలక జుట్టు వ్రేలాడుతూండగా కొంటెతనంగా గంతులు వేస్తూ ఆనందపరవశుడైపోతూన్న ఆరేళ్ళ వయసుగల చెయిన్లను చూసి గుమ్మంలో నిలబడివున్న మీనాక్షి "దురదృష్టవంతులము! తన ఆటపాటలకు ఎంతో ఉప్పొంగిపోయి ముద్దూ, మురిపెం చూపగల్గిన తండ్రిని శైశవంలోనే కోల్పోయాడు" అని మనసులో అనుకుంటూ కంట నీరెట్టుకుంది. న్యాయవాది వెంకటనరసింగరావుకు చాలా కాలమువరకు సంతానము లేదు. భార్యాభర్త లిరువురు సంతానముకొరకు ఎంతో పరితపిస్తూ అనేక వ్రతములు, దానధర్మములు జరిపారు. చివరకు ఒక పురుష శిశువు జనించాడు. తన పితామహుని పేరు నిలపదలచి వానికి 'చెయిన్లు' అని నామకరణంచేసి ఎంతగానో తృప్తిపడ్డాడు నరసింగరావు. కాని వాడి పసితనంలోనే అతన్ని అకాల మృత్యువు పొటన పెట్టుకున్నది. నరసింగరావు మంచి పేరు ప్రతిష్టలు రాబడీగల వకీలు. అయినప్పటికీ దానధర్మబుద్ధిగలవాడు కావడంచేత అతను సంపాదించిన ఆస్తి అతని అనంతరము విశేషముగా నిల్చింది కాదు. నరసింగారావును దూషించేవారు ఒక్కరు కూడా ఉండకూడదనే తలంపులో, అతని భార్య మీనాక్షి కొన్ని బాకీలనుంచి తేలికగా తప్పించుకునే మార్గాలను ఎంతోమంది ఎన్నోవిధాలుగా ఉపదేశించినప్పటికీ వాటిని చెవిని పెట్టుకోక 'నాఒక్క బిడ్డ యీమిగిలిన ఆస్తిని అనుభవిస్తేచాలును' అనుకుని నిశ్చింతగా స్థిరచరాస్థులను కొన్నింటిని విక్రయంచేసి బాకీలన్నిటిని పూర్తిగా తీర్చిసింది. ఇక ఒక చిన్న మేడ, కొద్దిగా మాగాణిభూమీ మిగిలింది. ఆస్తిపోకడకై ఆమెకు చింతపట్టలేదు. 'చూడబోతే వీడిది కొంచెం కొంటెస్వభావంగా తోస్తోంది. ఈ ప్రపంచంలో వీడు ఎలాబ్రతికి భట్టకట్టగలుతాడో' అని ఎప్పుడు తనకుమారునికొరకు విచారపడుతూండేది మీనాక్షి.

చెయిన్లు తల్లిమాట లెఖ్ఖచేసేవాడు కాదు. ఎపుడూ విధ్వంసంగా అల్లరిచేస్తూండేవాడు. ఇరుగు పొరుగు అమ్మలక్కలు మా అబ్బాయిని కొట్టాడనో, మా అమ్మాయిని తిట్టాడనో యీరకంగా మీనాక్షితో చెబుతూండేవారు. మీనాక్షి వణ్ణి ఒళ్లో కూర్చోపెట్టుకుని ఎన్నో సదుపదేశాలు చేస్తూండేది. అవేవి ఆ పసిహృదయంలో పనిచేయు లేదు. చికాకు ఎంతో విసుగుదలపొంది ఒకదెబ్బ వెయ్యాలని హస్తము ఎత్తగానే తనభర్త స్వరూపం మనసులో తొణికిసలాడటము, ఆ వెంటనే హస్తము క్రిందకు దిగిపోవటమూ జరుగుతూండేది.

చెయిను పాఠశాలలో ప్రవేశించి ఆరుమాసాలయింది కాని అక్కడ హాజరవటం మాత్రము పదిహేను దినములుమాత్రమే. పంతులుగారికి జీతం బాపతు పైకంమాత్రము ప్రతినెలా ఒకటో తారీఖు యింకా నాలుగురోజు లున్నదనగానే మీనాక్షినుండి ముట్టుతూవుండేది. 'నన్ను బళ్ళోని పిల్లలందరూ ఎగతాళి చేస్తూన్నారు. ఈ పిలకజుట్టు తీయించుకుని క్రాపింగు పెట్టించుకుంటానమ్మా' అని అపుడపుడు మారాము చేస్తూండేవాడు. "అలా వీల్లేదురా! ఇది మనవంశ సాంప్రదాయం. ఇరవై సంవత్సరాలపాటు మీ తండ్రి వకీలుగా పనిచేశారు. వారి ప్రఖ్యాతికి ఎన్నడూ పిలకజుట్టు అడ్డుతగల్లేదు. నీకు సరీగా అక్షరజ్ఞానమైనా కలగలేదు. నీకు యీ పిలకజుట్టు నామోషీగావున్నదా?' అని మీనాక్షి మందలిస్తూండేది. అసలు చెయిన్ల స్వరూపం మొదటి తడవ చూడగానే ఎవరికైనా నవ్వు కలిగిస్తుంది. సన్నగా యీనకట్ట బద్దవంటి శరీరం, వీపువద్ద కొంచెంగావంపు, పెదవులుదాటి ముందుకువచ్చే కొంచెం పొడుగాంటి పళ్లు, మిట్టపల్లాలతో కూడి నిడువైన నున్నని శిరము, దాని వెనుక కొబ్బరి పీచులాటి చిన్నపిలక, కొంచెం పెద్దదిగా కనిపించే బుజ్జిముక్కు, కోపంవస్తే ఆరు గంటలపాటు ఏకధాటిగా శోకాలు పెడుతూ ఏడిచేవాడి తీరు చూసి సాటిపిల్లలు వాణ్ణి తెగ వెక్కిరిస్తూండేవారు.

బడిగంట ధ్వనించగానే ఆ తరగతిలోని పిల్లలందరూ వచ్చేశారు. పంతులుగారు వచ్చి కుర్చీలో ఆసీనుడై పిల్లలవంక ఒకతడవ తేరిపార చూచాడు. ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా కండ్లు పెద్దవిచేసి ఇలా ప్రశ్నించాడు: "ఒరే అబ్బాయిలూ చెయిన్లుయేడిరా?"
"వాడు కాలవకట్టమీద తిరుగుతున్నాడండి."

"అల్లాగా, ఇవ్వాళ్ళ వాడిపనపట్టాలి" అనిపళ్ళు పటపటా కొరుకుతూ కుర్చీలోనుంచి లేచాడుపంతులుగారు. నలుగురు శిష్యులు ఆయనవెంటవెళ్లారు. పంతులుగారిని చూడగానే చెయిను ఒక మూలకు పరుగెత్తాడు. పంతులుగారు కూడా చేతి పేము బెత్తం పట్టుకుని వాడివెంట పరుగెత్తాడు. తారాజువ్వలాగా చెయిన్లు వాయువేగంతో పరువు తీస్తున్నాడు. వాడికి కొంచెం వెనుకగా ఆయాసపడిపోతూ మహాబాధగా పరుగెత్తుతున్నాడు పంతులు. పంతులు కొంచెం దగ్గఱపడేసరికి చెయిన్లు యింకో మూలకు దారితీశాడు. ఆ మూలనకూడా పంతులు ఎంతో శ్రమపడి సమీపమవుతూండేసరికి దగ్గర్లోనేవున్న చెట్లతోపులోనికి దూరి మాయమైనాడు. పంతులూ, ఆయన విద్యార్థులు అక్కడకుకూడా ఎగబడేసరికి అతివేగంగా కట్టపైకి పరుగెత్తి కాలవలోకి ఒక్కదూకు దూకి నీళ్ళల్లో మాయమైనాడు. పంతులుగారికి గుండెల్లో అదురుతీగ ప్రాకటం ప్రారంభించింది. భీతితో ఆయన శరీరం ఒణికిపోయింది. దేహమంతా ముచ్చెమటలు పోశాయి. మరునిముషంలో చెయిను నీటిపైకి తేలి ఒడ్డుకు సమీపంలో యీతకొడుతున్నాడు. పంతులుగారికి పిరికితనం వదిలిపోయింది. ఆయన గుండెల్లో ధైర్యం కుదిరింది. విస్మయంతో, సంతోషంతో ఆయన నేత్రాలు మెరిశాయి. కాని వెంటనే పట్టలేని ఆగ్రహం పొంగుకుని వచ్చింది. "అరీ భడవా! ఎంత పనిచేశావురా? ఒరే! నెమ్మదిగా దిగి వాణ్ణి లాక్కుని రండిరా!" అని ఆదేశించాడు గురువుగారు. వెంటనే ఒక విద్యార్థి నీళ్లలోకిదిగి చెయిన్లను కొంచెముందుకు నెట్టాడు. పంతులుగారు వెంటనేవచ్చి చెయిపట్టకుని చెయిన్లను బయటకు తీశాడు. చెయిన్లు పట్టుబడ్డ గజదొంగ లాగా నలుగురుపిల్లలమధ్యనా నిలబడ్డాడు. వాడినున్నని తలపై నలుగురు నాలుగు మొట్టికాయలు మోగించారు. ఆఖరుకు పంతులుగారు ఓపిక చేసుకుని పెదవులుగట్టిగా బిగించి పేముబెత్తాన్ని వాడి ఒంటిపై వేగంగా ప్రయోగించటం ప్రారంభించాడు. అపరిమితాగ్రహావేశాల్లో మునిగివున్న ఆగురుదేవుల వారికి ఆ బాలుని ఘోరవిలాపము అణుమాత్రమైనా వినిపించలేదు. కొంతసేపైన తదుపరి పేము బెత్తము వంటిపై అరుణ వర్ణమును చూచుసరికి ఆయనకు కోపం కొంచెం వెనుకాడింది. వాని అరచేతిపలుచని చర్మం అడుగునుంచి రక్తం పొంగుకుని వస్తోంది. ఈ శిక్ష చాలక కాబోలు పాఠశాలకు వెళ్ళినాక యింకా కొన్ని మొరటు శిక్షలకుకూడా గురిచేశాడు. చెయిన్లు పాఠశాలనుంచి విడుదల కాగానే ఒక్క పరుగున ఇంటికి వచ్చి ఘోరంగా ఏడుస్తూ తల్లి మెడను చేతుల్తో పెనేసుకున్నాడు. మీనాక్షి అదిరిపోయింది. ఆమె గుండెల్లో దడపుట్టింది. 'ఏమిట్రా చైన్లూ' అన్న ప్రశ్నకు జవాబుఉండదు. గుండెలు పగిలేలాగు ఏడుస్తున్నాడు. కొంతసేపు గడిచిన తదుపరి ఎఱ్ఱగా వాచి ఓపప్రక్కన పగిలి రక్తంప్రవహిస్తూన్న అరచేతిని చూపించాడు. మీనాక్షి శరీరం కోపోద్రేకంలో వూగిపోతూన్నది. చెక్కిళ్లపై అశ్రుప్రవాహం జారుతోంది. మనసులో ఆకస్మికంగా అగ్నిజ్వాలలు రగుల్తున్నాయి.

"ఎవరురా యీపని చేసింది?"

"పంతులుగారు......" ఇక మరి చెప్పలేక పోయాడు.

వెంటనే పంతులుగారికొఱకు పనిమనిషిని పంపింది మీనాక్షి. పది నిమిషాల్లో పంతులుగారు వచ్చారు. మీనాక్షి గుమ్మంలోపల తలుపు రెక్కచాటున నిలబడి పంతులుగారిని అడిగింది:

"ఏమండీ! మీరు బిడ్డాపాపా గలవారుకదా? యీపని ఎందుకుచేశారు?

ఆ ప్రశ్నలోగల గంభీరత, రోషావేశము జవాబు చెప్పేందుకు పంతులుగారి కంఠస్వరమును పెగలనిచ్చినవికావు. ఏమని జవాబుచెప్పాలో ఆయనకు తోచలేదు. రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచినపిమ్మట మరల అందుకుంది మీనాక్షి.

"చూడండి మేష్టారూ, మీ హృదయంలో పితృత్వం నశించి పోయిందనుకుంటాను. ఇటువంటి పైశాచికధోరణిలో గురుత్వం సాగిస్తే విద్యార్థిలోకం దద్దరిల్లిపోదండీ? ప్రపంచాన్నిగురించి ఎన్నో విష

యాల్ని తెల్సుకోవాలని ఆతురత చూపే పసిహృదయాల్ని ప్రథమదశలోనే ఇటువంటి సింహస్వప్నాలతో కల్లోలపర్చటమే మీరు నేర్చుకున్న విద్యావిధానమా?" పంతులుగారు నమ్రశిరస్కుడై మౌనంగా నిలబడివున్నాడు.

"మా కొంటెపిల్లవాణ్ణి మీ పాఠశాలకు పంపి తమకు ఇకమీదట ఎక్కువ శ్రమకల్పించటం నాకు ఇష్టంలేదు." పంతులుగారు మారుపల్కకుండా వచ్చినదారినే వెళ్లారు.

కాలచక్రపు గంభీరచలనములో రెండు వసంతాలు కళ్లుమూసినవి. తేలికగా తగ్గిపోగలదనుకున్న స్వల్పజ్వరమే క్రమేణా విషమించి మీనాక్షిని ప్రాణాపాయస్థితిలోకి దించింది. అంత్యకాలంలో తన అల్లారుముద్దుబిడ్డ ఏకైక సంతానము అయిన చెయిన్లను చూపి వాని హస్తమును తన అన్నగారి చేతిలో వుంచి ఆఖరి పల్కులుగా ఇలా అన్నది: "విణ్ణి వృద్ధిలోకి తీసుకునివచ్చే బాధ్యత నీపైవుంచి నిశ్చింతంగా ప్రాణాలు ఒదులుతున్నాను. నీ చెల్లెలి యీ కడసారి కోరికను నీస్వార్థమును ఎంత చంపుకుని అయినా సిద్ధింపచేయగలవనుకుంటాను." "నువ్వేమీ అదుర్దా చెందనవసరంలేదు చెల్లీ. చెయిననునా పన్నెండో సంతానంగా చూసుకుంటాను. వాడి అభ్యుదయమునకై నాశక్తిసామర్థ్యములన్నిటినీ ధారపోస్తాను." అని అంటూ ఆ మాతృహృదయానికి మాట యిచ్చాడు యీ పెద్దమనిషి.

మీనాక్షి శ్రాద్ధకర్మలు పూర్తిఅయిన తరువాత ఇల్లు అద్దెకుయిచ్చి చెయిన్లను తీసుకుని స్వగ్రామం చేరుకున్నాడు ఆమె అన్నగారు. దినములు దొర్లిపోయిన కొలదీ చిన్న బాల్యహృదయంలో అంధతమస్సులు వ్యాపిస్తున్నాయి. సహజంగా మానవునికి బాల్యావస్థలో అత్యవసరమైన మాతృత్వపు అమృతవర్షము, వాత్సల్యమిళితమగు ఆదరణ ప్రేమపూరితమగు వాక్కు, అపరిమితమగు మన్నన, బాల్య చేష్టలను క్రీడలను చూచి మురిసిపోయేవారి ఆనందము వాడికి పూర్తిగా ఆ మేనమామ ఇంట అలభ్యమైనవి. స్వేచ్ఛాసంతోషములను పూర్తిగా కోల్పోయి అపరిమిత నిరుత్సాహ వాతావరణంలో మేనమామ ఇంట మసులుతున్నాడు. కాలచక్రపు కదలికలోని అనుక్షణము ఏదో ఒక అవమానంతో వాడి మనసు బాధపడుతూనేవున్నది. మేనమామ ఇంటికి వచ్చిన మొదటిరోజునే ఆయన పదకొండుగురు సంతానము చెయిన్లు చుట్టూ చేరి "నీ బోడిగుండు చాలా బాగున్నదిరా! పిలకబావా" అనిఅంటూ వాడితలపై తలా ఒక మొట్టికాయ ఇచ్చుకున్నారు. ఇక అదే మొదలు, ఆ యింట్లో చిన్ననుండి పెద్దవరకూ వాణ్ని వాడి పేరుతో పిలిచేవారే లేరు. 'పిలకబావ' అనేది వాడికొక నూతన నామధేయమైపోయింది. ఇరుగు పొరుగువారు కూడా ఆ పేరే లంకించుకున్నారు చివరకు పాఠశాలలోని ఉపాధ్యాయుడుకూడా ఆ పదమే వాడుతున్నాడు. సిగ్గుతో, బాధతో వాని లేత హృదయం నిరంతరమూ కుమిలిపోతూన్నది. భోజనసమయానకూడా వాడికా బాధ తప్పటంలేదు. మేనమామ సంతానంలో కొంచెం వయసువచ్చిన నలుగురూగాక, మిగిలిన ఏడుగురూ ఏకసమయాన భోజనానికి హాజరవుతూంటారు. వడ్డింపు విషయంలోకూడా పక్షపాతం చూపబడుతూనే వుంటుంది. ఆ ఏడుగురి చివర చెయినులు కూర్చోవలిసి వుండేది. కూర, పులుసు మొదలైన ఆదరువులు ఆ ఏడుగురికీ సరిపోయిన తరువాత ఏమైనా మిగిల్తే చెయిన్లకు వడ్డించటం, లేకపోతే ఇన్ని పచ్చడి మెతుకులతోనే వాడి తిండి పూర్తి. ఒక చిన్న జర్మన్ సిల్వర్ గిన్నె వాడి భోజనపాత్ర, 'నా వెండికంచం ఏమైందీ?' అని ఒకరోజున అడిగినందుకు మేనమామ వలన వాడికి చావాచితకా తన్నులు తగిలాయి ఆకలిమంటలు జ్వలించిపోతూన్న కడుపుతో ఆ గిన్నె ముందుపెట్టుకుని కూర్చోవటం, తన పిల్లలకు వడ్డించగా మిగిలింది కొంచెమో గొప్పో మేనమామ భార్య ఆ గిన్నెలో పారేసిపోవడమూ జరుగుతూండేది. ఇక భోజనం చేస్తూన్నది మొదలు మేనమామ బిడ్డల్లో ఒకడు 'ఒరేయ్, పిలకబావకు ఆవకాయ ముక్కంటే చాలా యిష్టంరా!' అని అంటూ ఎంగిలి ముక్కను వాడి గిన్నెలోకి విసురుతుంటాడు మరొకడు మజ్జిగన్నం దూకిస్తాడు. ఇంకొకడు పులుసులోని ముక్కలువిసురుతూంటాడు. ఇంకొకడు వెనుకనుండి పిలకజుట్టు లాగుతుంటాడు. తింటూన్నంతసేపూ వెక్కిరింపు వేళాకోళాల్తోగడుస్తూంటుంది. తన బిడ్డలయొక్క యీ ప్రయోజకత్వాన్నంతా చూసి మేనమామ భార్య సంతోషిస్తూంటుంది. అన్నపుగిన్నె ముందు కూర్చున్నప్పటి నుంచి గతించిన దినాలు వాడికి గురుకొస్తూవుంటాయి. వెండికంచంలో వేడి అన్నం వడ్డించి పెరుగుముంత, మీగడగిన్నె

ప్రక్కన వుంచి, చిన్న చిన్న ముద్దలుగా చేసి చేతిలో పెడుతూ భోజనంపూర్తి అయేవరకూ కంచికామాక్షి కథలు చెప్తూంటే తనతల్లి మీ నాన్నమ్మ... ఆ వాత్సల్యం ఆగారాబం......నీరు నిండిన నేత్రాల్లో తలవొంచుకుని ఏమిటో ఆలోచిస్తూంటాడు వాడు.

'ఒరేయ్ ఏడుస్తున్నాడురోయ్' అని ఒకడూ 'వాడిఆట బాగా సాగించుకు నేందుకు అమ్మలేదే అని చింతిస్తున్నాడు లేరా' అని మరొకడూ 'యీకోణంగి మొహాన్ని చూసుకుని ఆవిడ ఎంత పొంగిపోయేదనుకున్నారురా?' అని మేనమామ భార్య యీవిధంగా ఎవరికితోచిన ప్రకారం వాళ్లు మాట్లాడుతూండే వారు.

చెయిన్లు మేనమామ పంజరంలో వుంచి తమయింట ఒక రామచిలుకను పెంచుతున్నాడు. ఆ చిలుకకు చిన్న చిన్న మాటలుకూడా నేర్పాడు. అది మానవ భాషలో రెండక్షరాల మాటలను మాత్రం తేలికగా ఉచ్చరింపగలదు. చెయిన్లు కనిపించగానే అది 'బావా' అని పలుకుతూంటుంది. అంత మర్యాదగా వాణి ఆ ఇంట్లో ఎవరూపిలవరు. ఆ పిలుపులోని సాదరత్వం వాడిగుండెను కొంచెంగా చల్లబరుస్తూంటుంది. ఒకరోజున చెయిన్లు తనతల్లిమాట జ్ఞాపకం వచ్చినందున కన్నీటి కణములు రాలుస్తూ అరుగుపై కూర్చున్నాడు. ఎదురుగా వరండాలో వ్రేలాడుతూండిన పంజరములోని పక్షి 'బావా' అని పిలిచింది. ఆ అనునయ కంఠస్వరం వాని దీనహృదయమునకు కొంచెం శాంతిని చేకూర్చింది. అశ్రువులు నిండిన నేత్రాలను వలుపుకుంటూ పంజరమువద్దకు వెళ్లి నిలబడ్డాడు. ఏకాగ్రంగా చిలుకవంక దృష్టి సారించాడు. ఈ నరహృదయం ఆ పక్షి హృదయం ఒక నిమిష కాలం ఏదో సంబంధమును విప్పిచెప్పుకున్నవి. పరస్పరంగా సానుభూతి చూపుకున్నాయి. చెయిన్ల మనసులో ఏదో సంచలనం కలిగింది. ఏవేవో భావాలు సుడితిరుగుతున్నాయి. కంఠస్వరం గద్గదికమై పోతూండగా వాడినుండి యీ మాటలు వెలువడినయ్. "గాలిలో హాయిగా తిరుగుతూండే రామచిలుకా, నీకు యీ గతి ఎందుకుపట్టింది? నీకుకూడా మీ నాన్న చచ్చిపోయినాడా?"

"చుప్. చుప్. చుప్..." అని అంటూ మొహం విచారంగా ఒంచి పలికింది రామచిలుక.

వారిరువురి మధ్య నాలుగునిమిషాలకాలం నిశ్శబ్దంగా గడిచింది. తిరుపరి చెయిన్లు పెదవులు దీనంగా కదిలాయి. "ఈ ఇంట్లో నీ స్థితీ నా సితీ ఒకటే. మన ఇరువురికీ ఏమీ భేదం లేదు. నీవు యీ పంజరంలో బందీవి. నేను యీ నాలుగు గోడల్లోనూ బందీని. నువ్వు యీ పంజరంలోనుంచి బయటపడలేవు నేను యీ ఇంట్లోనుంచీ తొలగిపోలేను..." వాడి గుండెలు దుఃఖభారంతో ఒణుకుతున్నాయి. ఇక మరి మాట్లాడలేకపోయాడు. అది మొదలు చెయినకు పంజరబద్ధమైన రామచిలుకతో అత్యంత సంబంధం ఏర్పడింది. ఆ పక్షి జీవి వాడి లేత గుండెలో అనురాగస్థానమును ఆక్రమించింది ఆ ఇంట్లో ప్రాణం నిల్పుకోగలందులకు మాత్రమే చాలినంతగా తనకేవిధంగా ఆహారం లభ్యమవుతూన్నదో, ఆ చిలుకకు కూడా అంతమాత్రముగానే జరుగుతూన్నదని చెయిన్లు తెలుసుకున్నాడు. నీరసపడిపోతూండిన తన శరీరంనాదిరిగానే ఆ రోజు కారోజు గడిచినకొలదీ ఆ పక్షికూడా దుర్బలమై కాంతిహీనమైపోతూన్నది. దానిని ఆ విధంగా వాడిపోనీకుకూడదని వాడు మనసులో దృఢప్రతిజ్ఞ చేసుకున్నాడు. వాని ప్రేమాదరణలు చూరగొనేవారు గాని తిరిగి వాటిని వాడియందు చూపేవారుగాని ఆ ఇంట్లో ఎవరూలేరు, ఆ పక్షిజీవి ఒక్కటితప్ప! దినమునకు కనీసం నాలుగుతడవలైనా పంజరందగరకు వెళ్ళి ఆ చిలుకతో సంభాషణ జరుపుతూంటాడు. తన గోడవలు దానితో నెమ్మదిగా చెప్పుకుంటాడు. ఆ వంకరటింకరపలుకుల ద్వారానే దాని హృదయావేదన తెలుసుకుంటూంటాడు. ఇతరుల బాధలను గుర్తింపగల ఉదాత్తమైన ఆత్మకలిగి వుంటే, భాషా సంబంధమైన ఇబ్బంది ఒక పెద్ద అడ్డంకి కాదుకదా! ద్రవించే హృదయం లేనివాడిముందు ఎంతపదలాలిత్యమును ప్రవహింపచేసినా వ్యర్థమే! తనకు ఏ ఆహారవస్తువు లభించినా అందులో తాను చాలా కొద్దిమాత్రమే స్వీకరించి మిగిలినదాన్ని భద్రంగా తీసుకునివెళ్ళి ఎవరూ చూడకుండా ఆ చిలుకకు పెడుతూంటాడు. 'రాగిణి' అని తన పక్షి మఱదలికి ముద్దుపేరు పెట్టుకున్నాడు. చేతివ్రేళ్ళను పంజరపు సందుల్లోగుండా లోపలకు పోనిచ్చి రాగిణి శిరమును సానునయంగా నిమురుతూ 'రాగిణీ నేను బ్రతికివుండగా నీకేమీ భయంలేదు. మా నాన్న చనిపోకమునుపే నీవు నాకు కన్పించివుంటే ఎంత సౌఖ్య

పడివుంటే దానివో..." అని అంటూంటాడు చెయిన్ను అప్పుడప్పుడు. దానిని కోరికల్లో ఒక కోరికను మాత్రమే వాడు ఎంతో కాలంనుంచీ అంగీకరించలేక పోతున్నాడు. "ఆ పనిమాత్రం నావల్ల కాదు. నన్ను మా మామయ్య చంపేస్తాడు" అని నిష్కర్షగా అనుకున్నాడు. కాని దానిదైన్య వైఖరి వాని మృదుచిత్తము కరిగిస్తూన్నది.

పాఠశాలలో పేద విద్యార్థులకు పలకలు పుస్తకములు ఉచితంగా పంచుతున్నారు. ఉపాధ్యాయుడు నిరుపేద బిడ్డలపట్టిక చదువుతున్నాడు. ఇన్‌స్పెక్ట్రిస్ నుండి ఒక్కరొక్కరే అవి అందుకుంటున్నారు. పట్టికలో చదివిన పేర్ల ప్రకారం చెయిన్ల మేనమామ బిడ్డలు ముగ్గురు పలకాపుస్తకాలు తీసుకున్నారు. చెయిన్లకు యీ విషయం విపరీత విస్మయమును కలిగించింది. ఆ రోజున వాళ్ళు చిరిగిపోయిన దుస్తులు ధరించి బడికి రావడానికిగల కారణం వాడు తేలికగా గ్రహించాడు. ఇంతలో ఉపాధ్యాయుడు వాడి పేరే చదివాడు. కర్ణపుటముల్లో అగ్నికణములు దూరినట్లుగా బాధపడుతున్నాడు. లేచి నిలబడ్డాడు గాని ముందుకు కదల్లేదు. ఉపాధ్యాయుడు కళ్ళెఱ్ఱ చేసి 'కదలవేరామందకోడి వెధవా' అని అరిచాడు. చెయిన్ల కాళ్ళు ముందుకు సాగటం లేదు. ఏదో రకమైన భీతితో వాడిహృదయం ఉడికిపోతూన్నది. మానవత్వం బాపతు ఒక విధమైన స్వయంశక్తి వాడి కాళ్ళు పట్టివుంచుతూన్నది. క్రైస్తవమత ధర్మావగాహనతో మృదుతరమై ఉన్న ఇన్‌స్పెక్ట్రిస్ హృదయమును వాడి అమాయకపు చూపులు తేలిగ్గా ఆకర్షించాయి. ఆ బాలకుని నిరాకరణకు ఏదో గూఢ కారణ ముండగలదని ఆమె తలచింది. 'మీరు వూరుకోండి మేష్టారూ' అని చెప్పి ఉపాధ్యాయుడి చికాకును సర్దుబాటు చేస్తూ ఏదో నూత్న విషయాన్ని తెలుసుకోవాలనే వాంఛను వెల్లడిచేసే దృష్టితో ఈ వస్తువుల్ని తీసుకోవటం నీకు ఇష్టం లేదా నాయనా?' అని వాత్సల్యంగా ప్రశ్నించింది.

"మీరు అన్నది నిజం. నాకు ఇష్టం లేదు." వాడి కంఠస్వరం లోహపు గంటవలె ఖంగున ధ్వనించింది. చెయిన్లు విధేయతగా చేతులు కట్టుకుని నిలబడి ధైర్యంగా మనసులోగల భావాన్ని స్పష్టంగా చెప్పాడు.

"ఎందువల్లనో..." ఇన్‌స్పెక్ట్రిస్ అధరముపై మందస్మిత పుష్పాలు రెక్కలు విప్పుకుంటున్నాయి.

"నేను బీదవాణ్ని కాదు గనుక—" యుద్ధరంగమునందలి ప్రథమశ్రేణిలోని సైనికుని హృదయంలో మాత్రమే అటువంటి నిర్భయత గాంచగలుదుమేమో ?

ఇన్‌స్పెక్ట్రిస్ ఆశ్చర్యంగా ప్రశ్నార్థకంగా ఉపాధ్యాయుని వైపు చూసింది. ఆయన తగిన జవాబు లేక బెదిరిపోయిన చూపుల్తో ఏదో ఆలోచిస్తూ నిలబడ్డాడు. చైన్లు ద్విగుణీకృతమైన నిబ్బరంతో మరల యీ విధంగా అన్నాడు. "ఇది సత్యం. నేను నిరుపేదల బిడ్డను కాను. మా నాన్న వకీలుపని చేసి బోలెడు సంపాదించాడు. నాకు తెనాలిలో మేడ, మాగాణి భూములూ వున్నాయి."

క్రీస్తుబోధలకు సంబంధించిన ఒక యథార్థ దృశ్యమును ప్రత్యక్షంగా ఆమె చూడగలుగుతూన్నది. ఆమె హృదయం సంతోషంగా సగర్వంగా క్రీస్తు దేవునికి జోహార్లు సమర్పించుకుంది. 'బాల్యహృదయం స్వర్గతుల్యం' అని ఆమె భక్తహృదయంలో ఏసుదేవుడు మందస్మిత వదనంతో అమృతవాక్కులు విరజల్లుతున్నాడు.

"నీకు యీ విషయమంతా ఎవరు చెప్పారు నాయనా?"

"మా అమ్మ చెప్పింది. అదే కాదు. సత్యవాక్కు మానవునికి రక్షణ కవచముగా ఉపయోగపడగలదని చెబుతూండేది. అందుచేతనే నేను ఇపుడు అబద్ధం ఆడదల్చుకోలేదు.

"ఆమహాతల్లి ఇప్పుడు ఎక్కడవున్నది నాయనా?"

ఈ ప్రశ్న వినీవినటంతోనే చెయిన నేత్రాలలో నీరు నిండింది. ఎదురుగావున్న ఉపాధ్యాయుడు 'ఈలోకంలో లేదు' అని జవాబు చెప్పాడు. దుఃఖము కొంచెం సర్దుబాటు చేసుకుని చెయిన్లు యిలా అన్నాడు: నేనే కాదు, మామయ్య బిడ్డలు కూడా ఏమాత్రం బీద వాళ్లు కారు. వాళ్ళకు పెద్దపెద్ద మేడలు నాలుగున్నాయి. మామయ్య చెట్టుకింద ప్లీడరీ పనిలో బోలెడు సంపాదిస్తున్నాడు. వెంటనే ఉపాధ్యాయుడు కల్పించుకుని "ఆమాట నాకు తెలుసును. కానీండి, పాపం ఆ బ్రాహ్మణుడు 'అధిక సంతాన

వంతుణ్ణి. ఈ సహాయం చేసిపెట్టవలిసింది అంటూ నిన్న సాయంకాలం మొత్తుకున్నాడండి. అందువల్ల జాలి కలిగి రాత్రే ఆ పేర్లను జాబితాలో చేర్చాను," అన్నాడు. "డామిట్ ! ఏమి పని యిది? అటువంటి రొట్టున్నపై జాలేమిటి? ఎవరో కొద్దిమంది వ్యక్తుల్ని సంతోషపర్వగలందులకు పాపకూపంలో దూకుతావా? ఎవరో అనుభవించవలసినవాటిని మరి ఇంకెవరికో కట్టపెట్టచూడటం భావ్యమా? ఆ ముగ్గురి వద్దనుంచి పలకలూ పుస్తకాలు తీసికోండి."

చైన్ల మేనమామ బిడ్డలు ముగ్గురూ వాటిని ఇచ్చి వేయక తప్పిందికాదు. ఈ సమాచారం చైన్ల మేనమామకు అందుటకు ఎంతోసేపు పట్టలేదు. క్రోధావేశపరుడై ఆయన చైన్ల రాకకు ఎదురుచూస్తున్నాడు. చైన్లు విచారగ్రస్తముగు వదనంతో తూలిపోతూ, భీతితో ఒణికిపోతూ లోపలకు వచ్చాడు.

"ఒరేయ్, పిలకబావాః ఇటురా" అని భయంకర నాదంతో ఒక పొలికేక. వాడి క్షీణదేహం గజగజలాడుతూ నీడవలె నెమ్మదిగా జరుగుతూ ముందుకు వచ్చింది. "దొరసానిగారితో ఏమని చెప్పావ్" చైన్లనుండి జవాబులేదు. కేసరిముందు నిలబడివున్న మేకపిల్లవలె భీతితో అదిరిపోతున్నాడు.

"మాట్లాడవేమి? నేను ఒక భాగ్యవంతుడననీ, అంతకంటె నీవొక జమిందారువనీ చెప్పుకున్నావా?"

చైన్లు యీ తడవకూడా మౌనాన్నే అవలంబించాడు. వాడి బుజములు ఒణుకుతున్నాయిగాని ఆ పెదవుల బిగింపులో చాలా కొద్దిమందిలో మాత్రమే చూడగలిగిన ఆత్మశక్తి బాపతు ఒక ఉన్నతలక్షణం ద్యోతకమవుతున్నది.

"ఎంత నిర్దాక్షిండై గలవాడివిరా?" ఒక్క గంతులో మీదకురికాడు. తనచేతులు నొప్పి పుట్టేనంతవరకూ వాణ్ణి కొట్టి తదుపరి ఆ అల్పదేహాన్ని క్రిందకు నెట్టి కాలుతో తన్నటం ప్రారంభించాడు. తన్ను తన్నుకీ ఆ ఎముకలగూడు భూమిపై ధూళిలో గాలిలోని కాగితపు ముక్కవలె అతి వేగముగా దొర్లుతోంది.

"నా యింటికి నీవు ఒక శనిగ్రహమైనావు. నాలుగేళ్ల వయసునే తండ్రిని చంపావు. ఆరవయేట తల్లిని పొట్టనపెట్టుకున్నావు. ఇప్పుడు నన్ను చంపాలని నా ఇంటికి చేరావు. కాని నిన్ను నేను..." దారుణమైన వికృతధ్వని, దానివెంట అమిత బాధాపూరితమగు మూలుగు వినిపించింది. ఈ ఘోరదృశ్యానికి కొంచెం దూరంలో నిలబడివున్న ఇంటి యిల్లాలి హృదయంలో మాతృత్వం, మానవత్వం తలలెత్తినవి. చంకలోని బిడ్డను క్రిందకుదించి ఒక అంగలో ఆయనచేతికి అడ్డవచ్చి యిలా అన్నది. "ఆ అర్భకుడి శరీరం ఇందాకటి దెబ్బలకే విరిగిపోయి వుండాలి. ఇక వూరుకోండి. వదినెను తల్పుకునైనా మీ కోపం చంపుకోండి. పాపం! ఆవిడ వీడిపై ఎన్నో ఆశలు నిల్పుకుని ప్రాణం విడిచింది."

"నువ్వు అవతలకు వెళ్ళు. దాని తొవ్వష్టపు పెంపకమే యీ భూతాన్ని ఇంతవరకూ తీసుకొని వచ్చింది. అధికారుల ముందు యీ నీచుడు నా పరువు తీసేశాడు." అని అంటూ భార్యను వెనుకకు నెట్టి మరొకతడవ ఆ క్షీణదేహాన్ని బలంగా త్రొక్కుతూ ముట్టగించాడు.

"అబ్బా ... అమ్మా?..." వేదనాపూరితమగు విలాపస్వరం. ఇంటియజమానురాలిగుండెలు దడదడలాడినై. ఆమె డొక్కల్లో ఒక ప్రక్కన మంట లేచింది. "పసితనంలోనే మాతాపితలు దూరమైపోయిన ఆ బిడ్డణ్ని యివ్వాళ్ళ యీ లోకానికికూడా దూరం చేస్తారా? మీకు నమస్కరించి చెప్పుకుంటున్నాను. పవిత్రుడైన ఆ నరసింగరావు సొత్తును మీరు అమానుషంగా నలిపెయ్యకండి..." అని రెండు చేతులతోను తన ముఖాన్ని కప్పుకుని ఏడుస్తూ ఒక మూలన కూలబడింది. చివరకు ఎంతో సేపటికి ఆయనకు కోపావేశం తగ్గింది. కాని చైన్లకు ఆ రోజంతా దూషణ తిరస్కారములుమాత్రం తప్పలేదు.

ఆ సాయంకాలసమయాన కుంటుకుంటూ నెమ్మదిగా మెట్లుఎక్కి డాబామీదకు వెళ్ళాడు. ఆ ఉదయాన మేనమామ కొట్టిన దెబ్బలబాపతు బాధ, నొప్పులూ ఇంకా పూర్తిగా తగ్గలేదు. వానిని చీకాకు పర్చుటకుగాని వెక్కిరించుటకుగాని అక్కడ ఎవరూ లేరు. నిశ్శబ్దత నిరాటంకంగా పరిపాలన జరుపుతూన్నది. చైన్లు దీక్షగా కూర్చుని ఏకాగ్రతగా ఆలోచిస్తున్నాడు. వాని స్మృతిపథమున తల్లిముఖబింబం నృత్యం చేస్తోంది. ఆ లేతగుండె తన బాధల్ని వెళ్లబోసుకుంటూంటె, ఆమె నేత్రములనుండి రక్తకణములు రాలుతూన్నవి. కరుణ ఒలికే ఆమెదృష్టులు వాని పీడిత హృదయమును ఆదరిస్తూన్నవి. సంధ్య చీకట్లు

అలముకుంటున్నాయి. ఉజ్జ్వలకాంతుల్ని కోల్పోయి క్షీణదశలో ప్రవేశించిన కృష్ణపక్ష చంద్రుడు ఆకాశ మార్గాన పిల్లినడక ప్రారంభించాడు. యుగయుగాలుగా యీ లోకపు దుఃఖసంఘటనలకు సాక్షీభూతములుగా వుంటూ వచ్చిన తారలు మాత్రం ఎప్పటి మాదిరిగానే మిణుకు మిణుకు మంటూన్నాయి.

చెయిన్లు ఎడదలో వర్ణింపలేని దుఃఖప్రవాహం ఒక్క తడవగా పొంగి పొఱలింది. ఆ దుఃఖావేశమును గుండెల్లో అణుచుకోలేక పోయినాడు. ఆకాశంలోకి అదే రీతిని దృష్టిని సారిస్తున్నాడు. వాడికి తెలియకుండానే వాని పెదవులు కదులుతున్నాయి. "అమ్మా, ఎప్పుడు వస్తావమ్మా? అసలు ఎన్నటికీ తిరిగి రానే రావా? పోనీ నన్నుకూడా వెంటతీసుకుని వెళ్లకపోయినావా? యీ మామయ్య ఇంట్లో యిక నేను వుండలేనమ్మా. అమ్మా!...అమ్మా!...యీ మోకాలిమీది గాయం ఎంత మంటగా వున్నదో తెలుసా? ప్రొద్దున మామయ్యతో కొంచెం నెమ్మదిగా కొట్టమని చెప్పక పోయినావా? ఒళ్లంతా తీపుగా వున్నది. ఈ యింట్లోని మనుష్యుల్ని చూస్తూంటేనే నా కేమిటో భయంగా వున్నదమ్మా! ఆ రోజున మన వూళ్ళోని పంతులుగారు, ఆయన్ని .అంత జోరుగా చివాట్లు పెట్టావే? మరి యివ్వాళ్ల అంతకు నాలుగురెట్లు అధికంగా చావ మోదిన యీ మామయ్యను నీవు వచ్చి ఎందుకు కొట్టేవని గట్టిగా అడగకూడదా అమ్మా? మీ అన్నయ్య కదా అనే ప్రేమతో వూరుకున్నావా?......అమ్మా! నీవు ఎక్కడ వున్నావమ్మా? ఒక వెన్నెలరాత్రిపుడు నీ పక్కలో నన్ను పడుకోబెట్టుకుని కామక్క కథ చెపుతూ ఆకాశం అవతల యింకొక లోకం వున్నదని చెపితివే? నీవు యిపుడు ఆలోకంలో వున్నావా? నన్ను చూసినట్లూ వుంటుంది. మామయ్యతో ఇంతగట్టిగా కొట్టవద్దని చెప్పినట్టూ వుంటుంది. నువ్వఒకతడవ వచ్చిపోకూడదా అమ్మా?...నడుములోని పెద్ద ఎముక జివ్వున లాగుతూన్నదమ్మా. ప్రొద్దున మామయ్య ఎంతో ఎత్తునుంచి కిందకు పడేసినపుడు రాయికి తగిలి ఆ ఎముక ఎంత మోత అయిందనుకున్నావ్? అలాంటి సమయంలోనైనా నువ్వు వచ్చి నన్ను రక్షించకూడదా అమ్మా? పోనీ నీకు రావటానికి వీలు చిక్కకపోతే యింత బాగా కొట్టవద్దని మామయ్యకు ఒక్క వుత్తరమైనా రాయవమ్మా! ఇక నేను యీ దెబ్బలు తినలేను. నువ్వు వెయ్యి మాటలు చెప్పినాసరే యీ దెబ్బలు తినటం ఇక నా చేతకాని పని...పోనీ నన్నుకూడా నీదగ్గరకే తీసుకెళ్ళకూడదూ? నేను కూడా అక్కడే వుందును గా...

......యీ చివరి మాటలు పలుకుతూన్నపుడు, వాటికి సమాధానంగా వాని మాతృదేవత సందేశము నేదైనా మోసుకొచ్చిందా అనునట్లుగా, వాయుమార్గాన అతి వేగంగా ఎగిరిపోతున్న ఒక పక్షి వంకరటింకరగా అరుస్తూ ముందుకు సాగింది.

ప్రతిరోజూ ఉదయకాలాన పాఠశాలకు వెళ్లిపోయేముందు ఒకతడవ పంజరమువద్దకు పోయి రాగిణిని పరామర్శచేసి రావడం చెయిన్లకు అలవాటు. ఆ అలవాటుప్రకారమే ఆ రోజు వుదయాన పంజరమువద్దకు వెళ్ళాడు. చెయిన్లను చూడగానే మామూలు పద్ధతిగా రాగిణి సంతోష ధ్వానములతో ఆహ్వానింపలేదు. తల ఒంచుకుని దిగులుగా విషాదంగా పంజరంలో పడి వున్నది.

"అలా విచారంగావున్నావేమి రాగిణీ?" అని అడిగాడు చెయిన్లు. రాగిణి నెమ్మదిగా నేత్రములు విప్పి అన్నది" బావా?"

"ఏమిటి రాగిణీ, యివ్వాళ్ళ యిలా వున్నావే? నీకింత విచారందేనికీ? నా ముద్దుల పిచ్చితల్లీ బాధపడబోకు." చిలక అరిచింది.

"నేను......"

"ఆఁ నీవూ..."

"చచ్చి......"

"అయ్యో! నీవు చచ్చిపోతానంటున్నావా? అయితే నేను మాత్రం ఎందుకూ బ్రతకటం? నా వెఱ్ఱి తల్లీ, అంతపని చేయబోకు నీవు మంచిదానివికదమ్మా! చెడ్డవాళ్ళు అటువంటి పనులు చేస్తారుగాని మంచి వాళ్ళు చెయ్యరు. ఏం రాగిణీ, అలా మాట్లాడకూడదు సుమా!......"

రాగణి కండ్లగొలుకులనుండి నీటిబొట్లు రాలుతున్నట్లున్నాయి. ఆ దీనదృక్కుల్లోని వేదనాగ్ని వాని హృదయాన్ని ద్రవింపచేసింది.

"అయ్యో? ఏడుస్తున్నావా రాగిణీ? ఏడవకు, నీకు ఏంకావాలో చెప్పు. నా ప్రాణం యిచ్చి

అయినా తెచ్చిపెడతా." అని మహాయోధునివలె వీరప్రతిజ్ఞగా పలికాడు చెయిన్లు. రాగిణి తనకాళ్లను రెంటినీ జోడించి చెయిన్లకు నమస్కారం చేసినట్లు కనబడింది. దాని గుండెల్లోని బాధను వాడు స్పష్టంగా తెలుసుకున్నాడు.

"ఏమీ లేదుగాని ఆ పనిచేసి యీ యింట్లో బ్రతకగలనా అని..." ఒక నిమిష కాలం శిరము పైకెత్తి ఆలోచించాడు. వాడికి మితిమీరిన మనోధైర్యం కుదిరింది. "ఏమైనాసరే కానియ్. నేను నీకు మాట ఇచ్చాను గనుక నీకోరికను నేనుతప్పకుండా నెరవేర్చి తీర్తాను. కష్టం వున్న వారికి సహాయంచేయటం తప్పు పనేమీకాదు..." బంధనబాధనుండి ఏ జీవినైననూ విముక్తి పొందించటం మహా పుణ్యకార్యమని ఏదో గగనశక్తి వేయికంఠాలతో చాటుతూన్నది. నూతనోల్లాసంతో, అమూల్యసాహసంతో చెయిన్లు వెంటనే పంజరంమీదకు హస్తమును పోనిచ్చి అడ్డంగావున్న చువ్వలలో రెండింటిని పటుక్కున విరిచాడు.

రాగిణి స్వాతంత్ర్యసిద్ధిచే పొందిన సంతోషంతో వుప్పొంగిపోతూ వాయుపథంలోకి ఒక్క గంతులో పరుగిడింది. గాలిలో స్వేచ్ఛగా ఎగురుతూ వున్న ఆ పక్షిజీవిని తన్మయత్వంతో పరికిస్తున్నాడు చెయిన్లు.

'ఏమిట్రా చూస్తున్నావ్?...అని వెనుకవైపు నుంచి మేనమామ వచ్చాడు. వెంటనే ఆయన దృష్టి పంజరంపై వ్రాలింది. "చిలక ఏదీ?" అని గాండ్రింపు.

వెంటనే తలపైకెత్తి చూచేసరికి ఎంతోకాలమైన మీదట దాస్యబంధనాలనుండి తప్పించుకున్న ఆ పక్షిజీవి స్వేచ్ఛాగానం సల్పుతూ ఆకసవీధిలో వీరవిహారం సల్పుతూన్నది. జరిగిన కథంతా వెంటనే గ్రహించాడు ఆయన. పట్టపగ్గాలులేని అహంకారంతో చెయిన్లను ఎత్తి కుదేశాడు. శరవేగంగా ఆ క్షీణదేహంపై దెబ్బలు తన్నులు పడుతున్నాయి.

"అబ్బ......అబ్బబ్బ......అమ్మ........."

"నోర్ముయ్...ప్రాణం తీసేస్తాను. నా ఇంటి ప్రతిష్ఠ మంటకల్పుతున్నావ్. రాక్షసుడివి. నిన్నివ్వాళ వధించేస్తాను......" ఆయన నోటినుండి మాటలు స్పష్టంగా వెలువడటంలేదు. కించిత్తు ఆటంకంకూడా లేకుండా నిర్దయగా ఆ అర్భకతనువుపై బలప్రయోగం జరిగింది. తన నిర్దోషిత్వాన్ని ఋజువుపర్చుకోదగిన వాతావరణం యీ లోకంలో లేక దారుణ హింసాకాండకు తన దేహాన్ని వప్పగించి వూరుకున్నాడు చెయిన్లు. పాపపుణ్యాలెరుగని ఆ అమాయక జీవి బాష్పప్రవాహ జనితమగు ఉష్ణశక్తికి మానవహృదయం తూల్లుపడదా? "అయ్యయ్యో, ఇవ్వాళ్లి వాడిప్రాణం తీసెయ్యకండి. అన్నివిధాలా వాడు దురదృష్టుడు." అని అంటూ లబలబలాడి ఏడుస్తూ ఆయన సతీమణి లోపల్నించి వచ్చింది. క్షణక్షణానికీ ఆ హింసాపాతకుని మనసులో కోపతీవ్రత హెచ్చవుతూ వున్నకొద్దీ ఆయన అవయవాల శక్తి తగ్గిపోతూన్నది, ఆయన హస్తములు చచ్చుపడి తమ అశక్తతను వెల్లడించుకుంటున్నాయి. చూడండి, మనము మాత్రం బిడ్డలు కలవాళ్లం కామూ? సంతానవంతుడైన కిరాతకుడు కూడా యిటువంటి పనికి పూనుకోడే! ఆ ప్రవహిస్తూన్న రక్తం మనకొంపను కాల్చేయదటండీ? ఇకనైనా వూరుకోండి." అని సతీమణి బ్రతిమాలింది. ఆయన అహంకారం అంతటితో తృప్తిచెందలేదు. అర్ధజీవంతో ఘోరబాధతో ఊపిరి పీల్చుకుంటూన్న ఆ అభాగ్యుణ్ణి నెమ్మదిగా నేలనుండి లేవతీసి వానిచే గోడకుర్చీ వేయించి ఇలా కఠినంగా శాసించాడు. "కాళ్ళూ చేతులూ కదిలించావా అంటే అవి నా చేతిలో ముక్కలై పోగలవు. జాగ్రత్త!" భార్యాభర్త లిరువురూ భోజననిమిత్తం లోపల కెళ్ళిపోయారు. బాలభానుని అరుణ కాంతుల్లో ఆ బాధిత బాలకుని విషాద వదనం మిలమిల మెరుస్తూన్నది. కాలచక్రంపదినిమిషాల ముందుకు జరిగింది. చెయిన్ల శరీరం అపరిమితబాధపడుతూన్నది. వాని చిత్తపథమున గతించిన స్వల్పజీవిత విశేషాలు దృశ్యరూపంలో తాండవిస్తున్నాయి. మోకాళ్ళలో నొప్పి అతితీవ్రంగా వ్యాపిస్తోంది. నడుములోని నరాలు బలమైన సుత్తి దెబ్బల బాధను కలిగిస్తూన్నవి. నిమిషములు గడిచినకొద్దీ అవయవములు పటుత్వహీనములై ఘోరతాపముతో అలమటింప చేస్తూన్నాయి. తలలోని నరాలు తెగిపోయేటంత వేగంగా కదులుతున్నాయి. స్వేదబిందుప్రవాహం శరీరాన్ని తడిముద్దగా చేస్తోంది.

"అమ్మా?......" అని తీవ్రావేదనగా ఒకతడవ ఆక్రందించి నేత్రములు మూసుకున్నాడు చెయిన్లు. ఆ కండ్లమూతలలో తల్లి వానిని ఆదరణగా పలకరిస్తోంది. నీరు తిరిగిన నేత్రాల్తో ఓదారుస్తోంది.

"నాయనా రా! నాలోకిరా! నిన్ను యీ విధంగా హింసించే వాళ్లెవరూ ఇక్కడ వుండరు. కరుణహృదయమే కరువైన ఆలోకంతో నీకిక పనిలేదు..."

"తప్పకుండా వస్తానమ్మా. ఇక నేను ఇచట వుండలేను."

"హింసాప్రవృత్తులు, బాధలూ లేని లోకంలో స్థానం చూపిస్తాను. త్వరగా రా నాయనా."

"వస్తున్నాను. అమ్మా వస్తున్నాను."

ఆఖరిచూపు యీ దారుణలోకం పైకి విసిరి, ఆక్షీణకాయం నీరసంగా క్రిందకు జారిపోతూన్నది. భూదేవి విశాల హృదయ భాగమునుండి ఒక సన్నని వేదనాస్వరం వెలువడింది. మానవలోకపు హింసాకాండకు చెందిన మారణహోమంలో ఆరోజున మరొక అమాయకజీవి దగ్ధం కావింపబడ్డాడు.

గోడమీద వంకర టింకర అక్షరాలతో కొంచెం అస్పష్టంగా ఇలా వ్రాయబడివున్నది "నేను చేసింది తప్పు అనికాదు. మఱల ఎప్పుడూ రాగిణిని తెచ్చి పంజరంలో బంధించకండి."

ఇట్లు

'వకీలు నరసింగారావు కుమారుడు యజ్ఞేశ్వర చెయిన్లు.' సమీపంలో ఇంటి కప్పుపై రాగిణి నిలబడి వెఱ్ఱిగా అరుస్తూ విలపిస్తోంది. ఆ దీన నాదములోని భావం ఈ విధంగా అయివుండాలి "బావా! నీవు ఎంత త్యాగజీవివి! నా స్వేచ్ఛ నీ ప్రాణాన్ని బలికొన్నది. నీవు నీ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నావు. కాని నేను నీ ఋణం ఎలా తీర్చుకోగలను?......" బారి అసోసియేషన్ భవనంలో ప్రఖ్యాత న్యాయవాది నరసింగరావు జ్ఞాపకార్థం ప్రతిష్ఠింపబడిన ఆయన చిత్రపటం సరీగా ఆ సమయానే గోడమీద నుండి ఆకస్మికంగా క్రిందకు జారిపడి పటాపంచలుగా పగిలిపోయింది. ఆ శిథిలచిత్రం గాజుముక్కలన్నీ విషాదవదనుడై ఏరి ప్రోగుపెడుతున్నాడు ఆ భవనపు కాపలామనిషి.

ప్రపంచంలోకెల్ల
ఎక్కువగా
అమ్ముడు
పోతున్న
సైకిల్స్



ప్రతి నిమిషంలోను, రాత్రింబగళ్లకూడా, ప్రపంచం మొత్తంలో ఎక్కడో ఒక చోట రెండు రాలె బైసికిల్స్ అమ్ముడు పోతూనేవుంటాయి. ఈ రకంలో బహుళ ప్రశస్తి పొందినవి రాలె, రాబిన్ హుడ్‌లు— అందంగా వుంటాయి; మెత్తగా పోతాయి; ఖర్చు అతి తక్కువ.

రాలె
SEN RALEIGH Products
రాబిన్‌హుడ్

SRC-48 TP